# ప్రతీ విత్తన దుకాణం తనిఖీ చెయ్యాలి

- నిబంధనలను పాటిస్తూ విత్తనాలను విక్రయించాలి...
- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ప్రణాళికాబద్ధంగా విత్తనాల స్టాక్ అందుబాటులో పెట్టుకోవాలి
- రైతులకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు
- విత్తనాల విక్రయం, ఈ పాస్ యంత్రాల వినియోగంపై రిటైలర్లతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

జిల్లాలోని రైతులకు నిబంధనలను పాటిస్తూ విత్తనాలను విక్రయించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విత్తనాల విక్రయం, ఈ పాస్ యంత్రాల వినియోగంపై రిటైలర్లతో నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కార్యక్రమంలో సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడు తూ జిల్లాలో విత్తనాల డీలర్లు నిబంధనలు పాటిస్తూ రైతులకు నాణ్యమైన విత్తనాలను అమ్ముతున్నారని, 99 శాతం వరకు ప్రక్రియ సజావుగా జరుగుతుందని, ఒక్క శాతం కూడా పొరపాట్లు జరగకుండా రాబోయే సీజన్ లో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. జిల్లాలో రాబోయే వానాకాలం సాగుకు అవసరం అయ్యే విత్తనాలు ఏ ప్రాంతంలో ఎంత డిమాండ్ ఉంటుందో అంచనా వేసి దానికి అనుగుణంగా అక్కడ ఆ విత్తనాలు అందుబా టులో ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్




వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. జిల్లాలో రైతులంతా ఒకేసారి నాట్లు వేయకుండా, ప్రణాళిక ప్రకారం నాట్లు జరిగేలా చూడాలని, ప్రతి మండలం పరిధిలో ఎప్పుడు నాట్ల ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్ తయారు చేసుకోవాలని, వరియేతర పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. రైతులకు విత్తనాలు అమ్మే సమయంలో నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలని అన్నారు. విత్తనాల బ్యాగ్ పై లేబుల్, నిల్వ చివరి గడుపు తేదీ మొదలగు వివరాలకు స్పష్టంగా తెలియజేసి అమ్మాలని అన్నారు. విత్తనాల అమ్మకం రికార్డ్ వివరాలు ఎప్పటికప్పుడు అప్ డేట్ చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఆకస్మిక తనిఖీలు చేసిన సమయంలో రికార్డులు అప్ డేట్ కాకపోతే చర్యలు తీసుకుంటామని అన్నారు. విత్తనాల అమ్మకం సమయంలో రైతులకు తప్పనిసరిగా తేది, విత్తనం వివరాలతో సహా రశీదు అందించాలని కలెక్టర్ తెలిపారు. విత్తనాలను లైసెన్స్ ఉన్న డీలర్లు, రిటైలర్లు మాత్రమే విక్రయించాలని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తమ క్లస్టర్ పరిధిలో ఎవరైనా అనధికారంగా విత్తనాలు విక్రయిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. క్రాప్ బుకింగ్ సమయంలో ప్రతి రైతు దగ్గర విత్తనాలు



ఎక్కడి నుంచి వచ్చాయో వివరాలు సేకరించాలని కలెక్టర్ ఏఈఓ లకు సూచించారు. జిల్లాలో విత్తనాల షాపుల తనిఖీ షెడ్యూల్ రూపొందించాలని, ఒక చెక్ లిస్ట్ తయారు చేసుకుని, ప్రతి షాపును పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని కలెక్టర్ తెలిపారు. గత సీజన్ లో జిల్లాలో పత్తి, మిర్చి వంటి పంటలు 300 నుంచి 400 ఎకరాలలో దాదాపు 100 మంది రైతులు నకిలీ విత్తనాల బాధితులయ్యారని, భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రైతుల పక్షంగానే



ప్రభుత్వం జిల్లా యంత్రాంగం పని చేస్తుందని, రైతులకు నష్టం చేకూర్చాలని ఎవరైనా వ్యాపారి



భావిస్తే వారి పట్ల జిల్లా కలెక్టర్ పరిధిలో ఉన్న వివిధ చట్టాలను వినియోగించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు సరఫరా చేస్తే సంబంధిత డీలర్ల నుంచి రైతులకు శాస్త్రీయంగా నష్టపరిహారం అంచనా వేసి చెల్లించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. నకిలీ విత్తనాలు ఎవరైనా అమ్ముతున్నట్లు డీలర్లకు తెలిస్తే వెంటనే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు పాటించే విత్తన డీలర్ల పట్ల అనవసరపు చర్యలు అధికారుల వైపు నుంచి కూడా ఉండవని, అనవసరంగా ఇబ్బందులకు గురి చేసే ప్రక్రియ చేయవద్దని కలెక్టర్ తెలిపారు. మార్కెట్ లో డిమాండ్ లేని విత్తనాల రకాలు సాగు చేయకుండా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. గతంలో ఉన్న అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ విస్తరణ అధికారి మిర్చి, వరి, మక్క వివిధ రకాల పంటలలో ఉపయోగించకూడని విత్తనాల రకాలపై తన క్లస్టర్ పరిధిలో ప్రకటన జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి ఎం.వి. మధుసూదన్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వాసవిరాణి, వెంకటేశ్వర రావు, విజయచంద్ర, సరిత, మండల వ్యవసాయ అధికారులు, ఫర్టిలైజర్ రిటైలర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటల సాగు... రైతుల పాలిట వరం...

- ఉద్యాన వార్షిక ప్రణాళిక ఖరారు...
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

ఉద్యాన పంటల సాగు కొరకు జిల్లా రైతులకు రూ.48 కోట్లకు 2025-26 వార్షిక ప్రణాళిక ఖరారు చేసినట్టు జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి ఎం.వి.మధుసూదన్ తెలిపారు. ఉద్యాన పంటలతో తక్కువ ఖర్చుతో నిత్యం అధిక లాభాలు అర్జించ వచ్చునని, ప్రభుత్వం ఉద్యాన పంటల సాగు కొరకు విరివిగా రాయితీలు అందిస్తుందని తెలిపారు. అకాల వర్షాల కారణంగా నష్టాలు చవిచూసి, తక్కువ ఆదాయం గల పంటల సాగు చేస్తున్నరైతులు, పంట మార్పిడి చేసి అధిక ఆదాయం ఇచ్చే, ప్రత్యామ్నాయ పంటలు ద్వారా అధిక లాభాలు అర్జించే ఉద్యాన పంటల సాగు చేయడం మేలని తెలిపారు. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం మంచి రాయితీలను కల్పిస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం తో 2025-26 వార్షిక ప్రణాళిక అమలు ప్రక్రియ ప్రారంభించబడినదని తెలిపారు.

**బిందు సేద్య పథకం (డ్రిప్) పథకం :**

బిందు సేద్య (డ్రిప్) పరికరాల కొరకు జిల్లాకు మొదటి విడతగా రూ.1617 లక్షల అంచనాలతో 1710 ఎకరాల భౌతిక లక్ష్యములు కేటాయించబడింది. షెడ్యూలు కులాలు షెడ్యూలు తెగల రైతులకు 100 శాతం, వెనకబడిన తరగతులు, చిన్న సన్న కారు రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 80% రాయితీ కల్పించబడును. డ్రిప్ కొరకు రైతులు తమ సమీప మీసేవ కేంద్రాల్లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

**ఆయిల్ పామ్ సాగు :**

కోతులు దొంగల బెడద లేని ఏకైక పంటగా ఆయిల్ పామ్ సాగును జిల్లాలో ఈ సంవత్సరం 14,500 ఎకరాలలో చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా రెండు ఆయిల్ కంపెనీలు అయినా తెలంగాణ ఆయిల్ ఫేడ్ మరియు గోద్రెజ్ కంపెనీలు మొక్కలను అంది స్తున్నాయి. మొక్కలకు రూ.11600ల రాయితీతో పాటు నిర్వహణ రాయితీ మరియు అంతర్ పంటలకు గాను ఎకరానికి రూ.4200 చొప్పున రాయితీ కల్పించబడుతుంది.

**సమీకృత ఉద్యాన మిషన్ పథకం :**

డ్రాగన్ ఫ్రూట్, అరటి, అంజీర, అవకాడో, బొప్పాయి, ఉసిరి, మామిడి, నిమ్మ, జామ, హైబ్రిడ్ కూరగాయలు, పూల తోటల పెంపకం గాను 227 హెక్టార్ల లలో రాయితీ కల్పించబడును. అలాగే ముదురు మామిడి తోటల పునరుద్ధరణకు 13 హెక్టార్లు, మల్చింగ్ షీట్ వేసుకున్న ందుకు 540 హెక్టార్లు, ప్యాక్ హౌస్ లకు 2 యూనిట్లు, ఉద్యాన యాంత్రికరణ వరకు 63 యూనిట్లు, ఫ్రూట్ కవర్లకు 25 యూనిట్లు, వీడ్ మ్యాట్ కొరకు 20వేల స్క్వేర్ మీటర్లు లక్ష్యములు కేటాయించబడినవి.

**రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకం :**

కూరగాయల సాగు పెంచడం కొరకు రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకం ద్వారా శాశ్వత పందిరిలో ఏర్పాటు నిర్మాణం కొరకు రూ.25 లక్షల ఆర్థిక కేటాయింపుతో 50 యూనిట్లకు లక్ష్యాన్ని కేటాయించబడినది.

**జాతీయ వెదురు మిషన్ పథకం :**

వెదురు సాగును ప్రోత్సహించడం కొరకు ప్రభుత్వం వెదురు మొక్కలు నాటినందుకు రాయితీ కల్పిస్తుంది. ఇందులో భాగంగా జిల్లాకు 50 ఎకరాలలో రూ.7.20 లక్షలు ఆర్థిక లక్ష్యముగా కేటాయించినారు.

**ఉద్యాన అధికారుల వివరాలు :**

కూసుమంచి, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మండలాల రైతులు పాలేరు ఉద్యాన అధికారి పి.అపర్ణ, ఫోన్ నెంబర్ 8977714104. ముదిగొండ, చింతకాని, బోనకల్, మధిర, ఎర్రుపాలెం మండల రైతులు మధిర డివిజన్ ఉద్యాన అధికారి ఎ.విష్ణు, ఫోన్ నెంబర్ 897771 4113, వైరా, కొణిజర్ల, కామేపల్లి, సింగరేణి, ఏనుకూరు మండలం రైతులు వైరా డివిజన్ అధికారి ఎ.వేణు, ఫోన్ నెంబర్ 8977714105, ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం తల్లాడ, కల్లూరు, పెనుబల్లి మండలం రైతులు ఉద్యాన అధికారి జి.నగేష్, ఫోన్ నెంబర్ 8977714103, సత్తుపల్లి, వేంసూర్ మండల రైతులు సత్తుపల్లి ఉద్యాన అధికారి కుమారి జి.శ్రావణి, ఫోన్ నెంబర్ 8977714114. కావున ఆసక్తి గల రైతులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని లాభదాయకమైన ఉద్యాన పంటల సాగు చేపట్టాలని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి ఎం.వి.మధుసూదన్ కోరినారు. ఇతర వివరాల కొరకు మీ మండలానికి సంబంధించిన ఉద్యాన అధికారిని లేదా జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలో గల జిల్లా ఉద్యాన & పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయంను సంప్రదించాలని ఎంవీ మధుసూదన్ తెలిపారు.

